# మనోగ్రహాకాశం



"నువ్వు నన్ను ప్రేమించకుండా ఉంటే — కాదు — పెళ్ళి చేసుకోకుండా ఉండి ఉంటే చాలా సుఖపడేదానివి. కాని, అలా జరగలేదు. అందుకే..." మాటలు మధ్యలో ఆపి బయటకు వెళ్ళిపోయాడు ప్రకాశరావు కోపంగా.

భర్తనుంచి అంతటి జవాబు వినవలసి వస్తుందని ఎప్పుడూ ఊహించలేదు పద్మ.

ఎవరో చాచి లెంపకాయ కొట్టినట్టయింది. అభిమానంచేత కన్నీరు కదిలింది. చేతిలో అల్లుతున్న ఎంబ్రాయిడరీ వర్కు పూర్తి చెయ్యడం మరిచిపోయింది. కుట్టబోయే అక్షరాల్లో 'గుడ్‌లక్' వ్యంగ్యంగా నవ్వుతున్నది. రంగు రంగుల దారాలు పాముల్లా మెలికలు తిరుగుతున్నాయి మెదడులో.

ఆయన మాటకు అర్థం చూచాయగానైనా ప్రతిధ్వనించేటట్టు తనేనాడయినా ప్రవర్తించిందా? సుఖపడాలని ఆకాంక్షతోనే ఆయన్ను పెళ్ళాడింది. అది ఆయనకు తెలుసు. మాటమాత్రంగా, భార్యగా తను సలహా యివ్వడం, గృహిణిగా సంసారం చక్కబడే ప్రయత్నం చెయ్యడం తప్పా? ప్రతి మగవాడూ ఇంతే. వాళ్ళ మాటకు ఎదురాడనంతకాలం పూజిస్తారు. అందులో ఏమాత్రం హెచ్చు తగ్గులు తమపట్ల కన్పించినా భరించలేరు. ఏ ఆదర్శ జీవితం తరిచిచూసినా ఇంతే. ఇంకా దూరంపోతే వ్యర్థంగా పోట్లాడుకోవడం, పరితాపాలు.

పద్మ ధనవంతుల బిడ్డ. కానీ ధనం ఇచ్చే అహంభావంగానీ, పెద్ద భవంతిలో నివసించే దర్పంగానీ ఆమెను బానిసను చేసుకోలేకపోయాయి. ధనంతో తన మిథ్యాబింబం ఆకృతి పెద్దచేసి చూసుకోవడం ఆమెకు అలవాటు లేదు. ఆ ఆకృతితో నలుగుర్ని ఈసడించుకోవడం, తను అందనిదానిగా నిలబడాలనుకోవడం వింతగా అనిపించేవి. పేదవాళ్ళూ, ధనవంతులూ అనే భేదాలు రెండు గీతలుగా నేటి సమాజంలో కలియకుండా తిరుగుతుంటాయి. వాటికి ఆకర్షణ అనేది ఉండదు. కానీ ప్రతి రేఖా ఏదో ఒక బిందుగర్భంనుండి పుట్టవలసిందే. ఆ గర్భంలోంచి పుట్టిన ఈ రేఖలు కొన్ని ఉన్నతికి జారుకుంటాయి. కానీ చిన్న రేఖలు లేకుండా రూపసాదృశ్యం చెయ్యడం కష్టసాధ్యం. ఏ ఉత్తమమైన దీర్ఘచతురస్ర సృష్టి జరగాలన్నా, గణితం దృష్ట్యా రెండు జాతుల రేఖల పొందూ ఉండి తీరాలి. మనుష్యుల జీవితం కూడా ఇంతేనేమో?

ప్రకాశరావు ఆమెకు సహాధ్యాయుడు. మనిషి మనిషి నెందుకు వ్యామోహిస్తాడో తెలుసుకోవడం కష్టం. దేశాలు నాశనం కావడానికి కారణం వెదికి పట్టుకున్న రాజకీయవాదులు; దారిద్ర్యం, ధనం అనే రెండు తెగలు సృష్టించి, వైరుధ్యాలు కల్పించిన లౌకికులు; కాలాన్ని శాస్త్రంతో బంధిస్తున్న శాస్త్రజ్ఞులు; అనంతంలోకి ప్రయాణం సాగిస్తూ ఎదిగిన మానవుడు — ఎవరూ ఈ ప్రశ్నకు జవాబు చెప్పలేరు. ప్రపంచంలో ప్రతి ప్రశ్నకు జవాబు దొరకదు. అప్పుడే ప్రపంచంలో కొన్ని కొన్ని మంచి పనులు జరుగుతూంటాయేమో? నిజంగా జవాబు దొరికినవాడే దానినుంచి, అభ్యుదయంలోకి కానీ, అధోగతికి కానీ మానవుడు తనకు తెలియకుండానే బాటలు వేసుకుంటాడు. జవాబు

# మనోగ్రహణం

దొరకని ప్రశ్నలనుంచి పుట్టేది వట్టి నిర్లిప్తత అయినా, దాని పర్యవసానం ఆనందదాయకమే అవుతుందిగానీ వినాశకరం కాదు. అది చాలేమో?

పద్మ ప్రకాశరావును కాంక్షించింది. తను అతని యిల్లాలు కావాలనుకుంది. చాలా మంది మిన్నబోయి చూశారు.

"ఇదేమిటే? ఇంత చదువుకుని, ఇన్ని తెలివితేటలు ఉండి ఆఖరికి ప్రియుణ్ణి ఎంచుకోవడంలో పప్పులో కాలేస్తున్నావు సుమా!" అన్నారు స్నేహితులు.

"బావకేం లోటని, పద్మా? నీ పక్కన నిలబడడానికి కావలసిన అర్హతలన్నీ ఉన్నాయి. ప్రకాశరావు వాడిముందు దివిటీ" అంది అత్తయ్య.

"పద్మా, నువ్వుగా చేసుకొన్న నిర్ణయాన్ని నే నేనాడూ కాదనను. కానీ, వట్టి ఆవేశంలో యీ పని చేస్తున్నావేమో, తరువాత బాధపడి ప్రయోజనం ఉండదు. పేదవాణ్ణి ప్రేమించి సుఖజీవితయాత్ర సాగించడం కథల్లో నిజం కావచ్చు. కానీ నిజ జీవితంలో నువ్వు పొరపడ్డావని తెలుసుకుంటే, అప్పుడు ఎదురయ్యే పరిణామాల ప్రభావానికి నువ్వు నిలబడగలగాలి" అన్నాడు తండ్రి.

పద్మ దూరంగా ఉన్న 'భగీరథుడు గంగను ఆకాశంనుంచి భువికి తెచ్చే' చిత్రువును చూస్తూ, "లేదండీ. నేనివన్నీ ఆలోచించే చెపుతున్నాను. మన అంతస్తుతో అతన్నేనాడూ నేను బేరీజువేసి చూడలేదు. అలా చూసిన్నాడు నేనతన్ని కావాలనుకునేదాన్ని కానేమో? ముందు కూడా చూడననే నమ్మకం నాకుంది" అంది.

"అయితే నే చెప్పాల్సిం దేం లేదమ్మా." తండ్రి మాటలకు పద్మ ఉప్పొంగిపోయింది. తండ్రి కూడా తన అంగీకారం చెప్పాడు. అదే ప్రకాశరావుతో చెప్పింది.

## జీవన కలశం

*శోభకృతు ఉగాది నవలల పోటీలో మూడవ బహుమతి పొందిన 'జీవన కలశం' (రచన: సుమలత, రేపల్లె) ప్రచురణ ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక 1963 జూలై 31వ తేదీ సంచికలో ప్రారంభం అవుతుంది.*

**ఎడిటర్**

"నన్ను పెళ్ళాడకపోతేనేం, పద్మా?"

"పెళ్ళాడితేనేం?" నవ్వింది. ఎర్రటి చేనేత చీరమీద అలుముకున్న నీలిమందార పూలు, ఎర్రపట్టీ ఉన్న హంసల జాకెట్టు, ఒకే ఒక్క బంగారు చెయిన్ మెళ్ళో, చెవులకు రవ్వల దుద్దులు, తల్లో చీకటి ఆకాశంలో ఒంటరి చందమామలా సన్నజాజి చెండు—హేండీక్రాఫ్ట్స వారి బొమ్మలా ఉంది పద్మ నవ్వుతూంటే.

"బాధపడాల్సి ఉంటుందేమో ఆలోచించుకున్నావా?"

"అంటే?"

"పద్మా, నేను, నా రూపం, సంపూర్తిగా కాకపోయినా చాలామటుకు నీకు తెలుసు. నా సమర్థతతో నీకు పూర్తి సంతృప్తి ఇవ్వగలనా అని. అదే ఆలోచించుకోమంటున్నాను."

"సంతృప్తి..." తిరిగి నవ్వింది పద్మ.

"చూడు, ప్రకాశరావు, సంతృప్తి కోసం ప్రయాణం చెయ్యడం అంటే అగాధంలో పడిపోవటంలాంటిది. అందులో పడ్డవాళ్ళు మునిగిపోతారు తప్ప తేరుకోలేరు. అసలు నిజానికి సంతృప్తికి అంతనేది లేదు. నాకు చందమామ కావాలి, అది లేకపోతే నే జీవించలేను, తెమ్మనమంటే నువ్వు తేగలవా? ఎవరూ తేలేరు. అప్పుడు నువ్వన్నట్టు నాకు అసంతృప్తి కలుగుతోంది అన్నమాట. ఒక్కమాట చెప్పాలంటే సంతృప్తి ఎండమావి. అందినట్టు కన్పిస్తుందేతప్ప అందదు. అందుకని మనం ప్రతి రోజూ గుప్పిడి మూసి అందింది అనుకోవాలి."

"ఆ అనుభూతి నిజంకాదని తెలిస్తే బాధ కలగదా, పద్మా?"

"ప్రకాశరావ్, బుద్ధ భగవానుడు ఎవరో యువతి తన కొడుకు చనిపోయాడని ఏడుస్తూ ఆయన దగ్గరకు వెళ్ళి కొడుకుని బ్రతికించమని అడిగిందిట. ఆయన యేమని ఆవిణ్ణి ఆదేశించారో నీకు తెలుసు కదా? అలాగే నన్నూ ప్రశ్నించు."

"నీ యిష్టం!"

"అయితే నీ యిష్టం మాట మరి?"

"నీలాంటి వెలలేని రత్నం నాకు లభిస్తుంటే కాదనగల ధైర్యం నాకు లేదు, పద్మా. వచ్చినదాన్ని పొందడం, అందనివాటి గురించి ఆలోచించకపోవడం నా అలవాటు" అన్నాడు ప్రకాశరావు పద్మను చూస్తూ.

"అదిగో మళ్ళీ రత్నాలూ, వైడూర్యాలూ అంటే నే ఒప్పుకోను."

"మరి యేమనాలి?"

"మనం అందరం — మనుష్యులందరూ ముత్యపుచిప్పల్లాంటివాళ్ళం. అందరి ఆశా కూడా స్వాతివానకోసం ఎదురుచూడ్డమే. నీ నా తరతమభేదం లేదు."

"అబ్బో! ఇకనుంచి నేను కవయిత్రి భర్తనని గర్వపడచ్చున్నమాట."

"కాదు, నేను పెద్ద 'ఫిలాసఫర్' గారి అర్ధాంగినని చెప్పుకుంటాను."

రెండు హృదయాల్లోంచి పుట్టిన నవ్వులూ ఏకమువుతగా కొద్ది రోజుల్లో వాళ్లను దంపతులు చేశాయి. ప్రకాశరావుకు ఉద్యోగం రావడం, పద్మ అతనితో కాపరానికి వెళ్లడం జరిగింది. ఏడాది జరిగిపోయింది.

పద్మమీద ప్రకాశరావుకు అమితమైన ప్రేమ. అది తనలాంటివాణ్ణే ప్రేమించి పెళ్లి చేసుకున్నందుకు కావచ్చు. లేకపోతే ఆమె ఆకర్షణ కావచ్చు.

పద్మకూడా అంతే. అతనిలో తనకు కావలసిన లక్షణాలు అన్నీ ఉన్నాయి. తను తక్కువ అనే భావంతో ఏవేవో మాట్లాడ్డం లాంటివి చెయ్యడు. గతమంతా మరిచిపోయి వర్తమానంతో ఆటలాడుతాడు తన ముందు. అతను కూడా పుష్కలంగా డబ్బు గణిస్తున్నాడు. లోటు అనేది లేదు వాళ్లకు.

ఎంతో నిర్మలంగా ఉన్న ఆకాశాన్ని మబ్బులు ఈర్ష్యచేత పులుము కుంటాయి. కారణం ఆలోచిస్తే అర్థంకాదు. అది ప్రకృతి ధర్మం అంటారు చాలా మంది. ఆ కాస్సేపూ చీకటిని ప్రేమించే నేర్పు మనిషికి ఉండదు. పెద్దగా ఆ చీకటిని తిట్టుకుంటూ ఏదో పోగొట్టుకున్న వాళ్లలా విలవిల్లాడిపోతారు. ఎంతటి మహా మహులైనా అంతే.

ఇన్ని ఆదర్శాలు, ఇంత మంచితనం వీళ్లలో ప్రతిబింబిస్తూంది; ఏమిటిలా ప్రవర్తిస్తున్నారు? ఇలా జరగడానికి వీల్లేదు. ఎక్కడా జరగదు—అనుకునేవాళ్లకు ఒకటే జవాబు. అది కాలం; వాళ్లు మనుష్యులు. మబ్బులు పట్టినప్పుడు చంద్రుడు కనపడకపోవడం ఎంత నిజమో, ఇదీ అంతే. అప్పుడు చంద్రుడు లేడు. అందుచేత ఆ పదార్థమే మిథ్య అనుకుంటే నష్టం ఎవరికీ ఉండదు; అనుకునేవారికి తప్ప.

పద్మ అలాగే కూర్చుంది. ప్రకాశరావు అంతలా మాట్లాడతాడని తనెప్పుడూ అనుకోలేదు. తనేమందని? అయినా ఎప్పుడూ ఆయన చర్యలకు తను వ్యతిరేకించలేదు. తన కిష్టం లేక పోయినా, నిన్నటికి నిన్న ఇలాగే జరిగింది. దాని కంతలా బాధపడాలా? "ఈ కుర్రవాడికి తల్లి తండ్రులు లేరు. చిన్నతనంనుంచీ బీదరికంతో పెరిగాడు. సహృదయులు తోచిన సహాయం చేసి, అతని భావికి తోడ్పడతారని ఆశిస్తున్నాం." ఓ కుర్రాడు పై విధంగా ఎవరో వ్రాసియిచ్చిన కార్డు తీసుకువచ్చాడు లోపలికి.

ప్రకాశరావు కార్డు తీసుకుని చదివాడు. పద్మ వచ్చి కుర్చీ హేండిల్‌మీద కూర్చుంది. చదివింది.

"పొట్టకోసం కొత్త విద్యలు."

"ఛా! అలా అనకు." ప్రకాశరావు ఆ కుర్రవాణ్ణే చూస్తూ అన్నాడు.

పద్మ వాణ్ణే లక్ష ప్రశ్నలు వేసింది.

*చీకటిని ఎవరూ ప్రేమించరు. రహస్యం చీకటి వంటిది. జన్మాంతం కలిసి ఉండవలసిన వారి మధ్య ఒక్క రహస్యానికి అయినా తావులేదు. మనిషికి మనిషికి మధ్య గోడలు నిర్మిస్తుంది రహస్యం. నమ్మకం నశించిన తరువాత ఆకులు పట్టుకొనడం వ్యర్థం.*

ప్రకాశరావు పది రూపాయలు ఇచ్చి పంపించాడు.

"మీరు ప్రతివాళ్లనీ నమ్మతారు."

"అవునేమో?"

"ఈ రోజుల్లో ప్రతివాడికి ఈ విధంగా డబ్బు గడించడం తేలికయిపోయింది."

"పోనీ నిజం అనుకోకూడదా, పద్మా."

అలాగే గుమ్మం వైపు చూస్తూ అతను.

"అబద్ధం అనుకుని ఆలోచిస్తే ఒళ్లంతా తేళ్లూ, జెర్రులూ పాకినట్టుగా ఉంటుంది. వాళ్లకి పుట్టినప్పటినుంచీ దొంగతనంగా డబ్బు గణించడం ఎలాగో నేర్పుతున్నామన్నమాట. రేపు వాడి కాళ్లమీద నిలబడి ఎలా బ్రతుకుతాడు? ఇలాగే మనిషిలో విలువలు చచ్చిపోయేది. మనం కూడా దాన్ని..."

"అయితే డబ్బు ఇవ్వడం తప్పంటావా?"

పద్మ మాట్లాడలేదు.

"అందుకే నిజమనుకోమంటున్నది." ప్రకాశరావు చిన్నగా నవ్వాడు.

అలాగే ఇంటికి వచ్చిన ప్రతిమనిషికి పదీ, పాతికా సహాయం చేసినా తనేనాడూ కాదన లేదు.

సరిగ్గా ఏడాదిక్రితం కాబోలు ...

"అమ్మా!" ఎవరో పిలిచారు బయటనుంచి. పద్మ హాల్లోకి వచ్చింది. ఆ అమ్మాయికి పద్నాలుగేళ్లు ఉండవచ్చు.

"ఎవరు కావాలి?"

"ప్రకాశరావుగారు లేరాండి?"

"ఎందుకు?"

"నన్ను రాఘవరావుగారు పంపించారు."

ఆయన లోపల స్నానం చేస్తున్నారని, వచ్చి కుర్చీలో కూర్చోమంది. ఆ అమ్మాయి నెమ్మదిగా వచ్చి కుర్చీలో కూర్చుంది. కాని ఆ అమ్మాయి దృష్టి అక్కడ లేదు. ఆ కూర్చోడంలో కూడా ఏదో భయం కన్పిస్తున్నది.

"నీ పేరేమమ్మా?"

"సుభద్ర" అంది నెమ్మదిగా.

పద్మ ఎదురు సోఫాలో కూర్చుంది. సుభద్ర తన చేతిలో పుస్తకం తెరిచి పేజీలు తిప్పుకుంటున్నది. ఆ పుస్తకంలోంచి హఠాత్తుగా నాలుగైదు కార్డులు జారి కింద పడ్డాయి. సుభద్ర వంగి అవి ఏరుకుంటున్నది. పద్మ తన కాళ్ల దగ్గరగా పడ్డ కార్డును తీసి చూసింది. "ఈ పసిపాప తండ్రి హఠాత్తుగా వ్యాపారంలో దెబ్బతిని ఆత్మహత్య చేసుకోవడం మూలంగా ఈ అమ్మాయి అనాథ అయింది. నా అనేవారు ఎవరూ లేరు. ఆదరించి ఆప్యాయత కన్పరిచే వాళ్లే ఆప్తులు. విధి వెక్కిరించిన యీ జీవికి చేయూత నిచ్చేవాళ్లే బంధువులు." క్రింద ఎవరిదో సంతకం ఉంది.

"పద్మా?" దుస్తులు వేసుకుని హాల్లోకి వచ్చాడు ప్రకాశరావు.

"ఈ అమ్మాయి..." ఆగిపోయింది ఎలా చెప్పాలో తెలియక పద్మ.

"ఏం అమ్మా?"

"ఈ ఉత్తరం రాఘవరావుగారు మీకు ఇమ్మనమన్నారండి" అంది పుస్తకంలోంచి ఉత్తరం తీసి యిస్తూ.

"రాఘవరావుగారా" అన్నాడు గతంలోకి వెడుతూ.

ప్రకాశరావు ఉత్తరం చదువుకుంటున్నాడు. పద్మ భర్తను పరీక్షగా చూస్తున్నది. మొహంలో ప్రతి నరం నీటి పాములా మెలికలు తిరుగుతున్నది. మొహాన్ని గతం నలుపు చేస్తున్నట్టుగా ఉంది.

"రాఘవరావుగారు ఎక్కడున్నారమ్మా?"

"పదిహేను రోజులక్రితం ఆస్పటల్లో చనిపోయారండి."

"ఆ!" అన్నాడు ప్రకాశరావు.

"నువ్వు రమేశంగారి పాపవికదూ?" అన్నాడు ప్రకాశరావు.

"అవునండి."

పద్మను చూస్తూ అన్నాడు అతను: "పద్మా, సుభద్ర మనింట్లోనే ఉంటుంది... సుభద్రని స్కూల్ ఫైనల్ పాస్ చేయించి యీ అమ్మాయిని ఆదుకోవలసిన బాధ్యత మనమీద—నీమీద ఉంది. నీ చెల్లాయిలా చూసుకోవాలి పద్మా." తిరిగి సుభద్రను చూసి, "సుభద్రా, ఇక్కడ నీ కేలోటూ ఉండదమ్మా. ఇది మీయిల్లే అనుకో. తెలిసిందా? ఆ గదిలోకి వెళ్లు. అది ఇకముందు నీదే. నీకు తెలియని పాఠాలు అక్కయ్య చెబుతూ ఉంటుంది" అన్నాడు.

సుభద్ర నడక నేర్చుకున్న దానిలా ఆ గదిలోకి నడిచి వెళ్లింది.

పద్మకు ప్రకాశరావు చేసే పనులన్నీ కలల్లో జరిగినట్టుగా అనిపిస్తున్నాయి. కొన్ని సంగతులు సొంతం తనకు అర్థం కానివాటిల్లోకూడా, తనలాగే క్రియారూపంలో సాగిపొమ్మంటాడు. ఈ కర్తవ్యాల ఆదిమధ్యాంతాలు ఎక్కడో తనకు తెలియదు. ఏదో కావ్యాన్ని తెరిచి మధ్యస్థంగా చదవడం మొదలుపెడుతున్నట్టుగా ఉంటాయి

'శ్రీ సుభా'

అతని నిర్ణయాలు. ఆయనకు తెలుసు ఈ మధ్యస్థపు అధ్యాయంలో తను చిందర వందర అవుతుందని. మరెందుకలా ప్రవర్తిస్తారు?

నిజానికి ఆనాడుకూడా తను బాధపడలేదు. సుభద్ర ఇంట్లోనే ఉండి చదువుకుంటున్నది. అలాగే ఏడాది తిరిగింది. తనను సుభద్రఅక్కయ్యా అని పిలుస్తుంది. చేతనైన సహాయం చేస్తుంది. నిజానికి ఆ అమ్మాయి గురించి తనకేం తెలియదు, ఎవరో ఏమిటో? చాలామంది ఇదేప్రశ్న అడిగేవారు "చుట్టమా?" అని. అవునంది, ఎలా కాదనాలో తెలియక. తన బంధువులనూ, తననూ ఎరిగున్నవాళ్లు సుభద్ర గురించి ప్రశ్నించిన నాడు మరీ తికమకగా ఉండేది. ఈ ఏడాదిలో సుభద్ర ఎదిగింది. వయసువచ్చి శరీరానికి పోతపోస్తున్నది. తన పక్కన నిలబడితే, అందంలో ప్రతి అవయవంలో ఆమెకు తీసికట్టు అన్నట్టుగా ఉండేది. ఆరోజులనుంచే చుట్టుపక్కల వాళ్లకు సుభద్ర సమస్యఅయి కూర్చుంది. ఎదిగిన యువతి, ఫలానా అని తెలియని మనిషి, పరాయి ఇంట్లో ఉండడం, తనముందే ఎక్కడికి వెళ్లినా గుసగుసలు వినిస్తున్నాయి. భర్తను తలుచుకుంటూ నవ్వుకుంటారు. ఆయన స్వభావం తనకు తెలుసు. ఆ నిజం చూపించి అందరినీ నమ్మించాలనుకుంటే, అది అసాధ్యమని కొద్దిరోజుల్లోనే గ్రహింపుకు వచ్చింది.

"నీకు చాలా ఓర్పు, పద్మా" అన్నారు ఎవరో. తను మాట్లాడలేదు.

"ఇదే నేనయితేనా, ఏ నుయ్యో, గొయ్యో చూసుకునేదాన్ని. ఛీ! కాస్తయినా ఇంగితజ్ఞానం ఉండనక్కరలేదూ? ఇంట్లో భార్య ఉండగా."

ఇలా చీకటయ్యేవి కొన్ని సాయంకాలాలు సంభాషణలతో.

"ఆయన అలాంటివారు కారు" అనేది వస్తున్న ఉద్వేగాన్ని ఆపుకుంటూ.

"నువ్వే కాదమ్మా. ఆడది పెళ్లి చేసుకున్న తరువాత ఇవన్నీ అనుభవించవలసిందే. కర్మ. కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుంది." ఇంటావిడ ఉవాచ. తనకు ఏడుపు వచ్చింది. ఏవిధంగా ఆపుకోవాలన్నా ఆగడం లేదు. హాల్లో అలాగే ఉండిపోయింది.

"అక్కయ్యా, ఏడుస్తున్నావా?" తన బాధకు ప్రతినిధి అడుగుతున్నది.

"లేదమ్మా."

"అన్నం తినలేదు కదూ?"

పద్మ ఆ రోజు చాలా విసిగిపోయింది. అంతవరకూ బిగించి పట్టుకుంటూ వస్తున్న తంత్రులు ఎవరో తెంచివేశారు.

"సుభద్రా, నువ్వెవరమ్మా?"

సుభద్ర అలాగే చూసింది దూరంగా. గోడమీద కదలాడే కేలండర్‌లో శంతనుని ముందు గంగ తన కన్నబిడ్డల్ని గంగపాలు చేస్తున్న దృశ్యం. శంతనుడిలో బాధాపరితప్త హృదయం బీటలు వేసే ముందు కలిగే బీభత్సం.

# మనోగ్రహణం

"అక్కయ్యా, నాకూ తెలియదు. మాకో పెద్ద ఇల్లూ, నాన్నా ఉండేవారు. ఓ నౌఖరు, అన్నయ్య ఉండేవారని కలలో మాదిరిగా గుర్తుందంతే. కానీ అది నిజమే. ఓ రోజున ఎక్కడికో వెళ్లిన నాన్న తిరిగి రాలేదు. వెంకన్నని అడిగితే వస్తారమ్మా అనేవాడు. చాలా రాత్రిళ్లు నిద్ర పట్టేంతవరకూ కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చునేదాన్ని. నాన్న వచ్చేవాడు కాదు. ఆఖరికి వెంకన్నకూడా రావడం మాని వేశాడు. ఓ రోజున ఎవరో వచ్చి మేం ఉండేది మా యిల్లు కాదని వెళ్లిపొమ్మన్నారు. నాకేం తెలియలేదు. ఎవరో నన్ను భుజంమీద పడుకోబెట్టుకుని తీసుకువెళ్లారు. వారింట్లోనే పెరిగాను. ఆయన పేరు రాఘవరావుగారు. బుద్ధిగా చదువుకోమని ఎప్పుడూ చెబుతూ, నీకు చదువు చాలా అవసరం అనేవారు. కానీ ఏడాదిక్రితం ఆయనా కన్నుమూశారు."

"మరి మీ అన్నయ్య?"

"అన్నయ్య నాన్నకన్న ముందుగానే ఎక్కడికో వెళ్లిపోయాడు." పద్మ సాంతం వింటూ ఉండిపోయింది. సుభద్ర తన చరిత్రంతా అంతవరకూ ఎవరిముందైనా చెప్పుకోవాలని ఆత్రుత పడిందో ఏమో—ఆమె ఎందుకో కన్నీరు కార్చింది. మాటల్లో దైన్యం, కరుణ దాగడం లేదు.

"అక్కయ్యా, నేను అనాథని. నాకెవరూ లేరు కదూ?"

పద్మ కేలా జవాబు చెప్పాల తెలియలేదు.

"ఇంతవరకూ అనాథననే ఏడ్చేదాన్ని ఒంటిగా. కానీ...."

"ఏమిటి సుభద్రా?"

"అక్కయ్యా, బావగారూ, మీరూ, నన్ను



'నా ఎనక ఎవ రోను....'

చిత్రం—జి. సి. శకుంతల (హైదరాబాదు)

ఆదరించారు. అందుకు ప్రత్యుపకారం చెయ్యాల్సి వస్తే నాకది అసాధ్యంకూడా. కానీ, నామూలంగా మీకు బాధ కలగడం...." ఆగి చెప్పడం మొదలు పెట్టింది.

"మిమ్మల్ని అన్నట్టుగానే అందరూ నన్నూ వెక్కిరిస్తున్నారు. నామూలంగా మీరు వ్యధ పడ్డం దేనికి? నేను వెళ్లిపోతాను, అక్కయ్యా."

"ఎక్కడికి సుభద్రా? ఎలా వెడతావు?"

"ఆ రెండిటికీ జవాబు నా జీవితంలో దొరకదేమో! దొరికిన్నాడు తప్పకుండా తిరిగి మిమ్మల్ని కలుసుకుంటాను."

పద్మకు కళ్లమ్మట నీళ్లు తిరిగాయి. అంతవరకూ, సుభద్రమూలంగా తన సంసారం విచ్ఛిన్న దశకు వస్తున్నదని బాధపడసాగింది. కానీ, భర్త ఆదరించిన మనిషిని తను కాదని ఏమీ చెయ్యలేదు. సుభద్ర నిర్ణయం వినడంతో పద్మకు సిగ్గనిపించింది.

"సుభద్రా, మీ బావ నీలాంటివాళ్లకి ఎందరికో సహాయం చేస్తూ వచ్చారు. నాకిష్టం లేకపోయినా ఒప్పుకునేదాన్ని. కానీ, నిన్నుయింట్లో ఉంచి చదువు చెప్పిస్తానన్నారు. నిజం చెప్పాలంటే నాకానాడు చాలా బాధే అనిపించింది. కానీ ఊరుకున్నాను. నువ్వు పెరిగి పెద్దదానివయ్యావు. దానితో నాకు కొత్త బాధలసృష్టి జరిగింది." పద్మ ఆగింది.

"సుభద్రా, నీ మీద లేని ఆప్యాయత ఉందని నిన్ను మభ్య పెట్టడం నా అభిమతం కాదమ్మా. అలా ఎవరన్నా మనం నమ్మకూడదు. కీడు జరగనంతవరకే ఎవరైనా సరే మహాత్కార్యాలు చేస్తామని ఉవ్విళ్లూరేది. ఏపక్కనుంచైనా చిన్న చెడుసృష్టి అయితే, అంతా పోతుంది/ ఓ స్త్రీగా నువ్వంటే నాకు జాలీ, సానుభూతీ ఉన్నాయి. అందుకని నీమూలంగా నలుగురి నుంచి నేను మాటలు పడలేనమ్మా. నా సంసారం పది కాలాలపాటు నిర్మలంగా సాగాలని నాకు అన్పించడం స్వార్థమేమో నాకు తెలియదు. నేనే నిన్ను వెళ్లిపొమ్మని చెప్పాలనుకున్నాను."

"అక్కయ్యా!" ఏడ్చేసింది సుభద్ర.

"నిజం చెప్పానని ఏడుస్తున్నావా, సుభద్రా?"

"కాదు."

"ఇది ఇంతేనమ్మా. స్త్రీ అనాథగా పుట్టడం తప్పుకాదు. పెరగడమే తప్పు."

"అవును. అదే నేనూ తెలుసుకున్నాను, అక్కయ్యా."

"సుభద్రా, ఇక్కడ అనాథ బాలికాశ్రమంలో నాకు తెలిసినావిడ ఆఫీసరుగా పనిచేస్తోంది. నిన్నక్కడ చేర్పిస్తాను. వీలు చూసుకుని నేనూ, ఆయనా వచ్చి చూస్తూంటాము. నీకిష్టమేనా, సుభద్రా?" కళ్లల్లోకి చూస్తూ అడిగింది పద్మ.

"మీ యిష్టం."

పద్మ సుభద్రను తీసుకుని అనాథ బాలికాశ్రమంలో చేర్పించి వచ్చింది. ఈ గొడవ జరిగిన రెండు రోజుల వరకు ప్రకాశరావుకీ విషయాలే

తెలియదు. పద్మ ఎలా చెప్పాలో అర్థంకాక మౌనంగా ఉండిపోయింది. పద్మ ఒంటిగా ఇంటికి తిరిగివస్తే ఏం తోచలేదు. భర్తవస్తే ఏం జవాబు చెప్పాలి? ఆయనతో తను మాట మాత్రంగా చెప్పకుండా ఈపని చేసింది. ఏమం టారో? ఇందులో నిజానికి తన తప్పు ఉందా? చాలామందికి అసలు లేకుండా పోయే ఓర్పూ, సహనం తనకుఉన్నాయి. మంచితనం ఉంది. అందుకే సుభద్రను ఇంతకాలం ఆదరించగలిగింది.

సాయంకాలానికి ప్రకాశరావు రెండు పాకె ట్లతో హాల్లోకి అడుగు పెడుతూనే కేక వేశాడు, "సుభద్రా!" అంటూ. తిరిగి "పద్మా!" అని పిలుస్తున్నాడు. లోపల గదిలో ఉన్న తనను ఎవరో న్యాయస్థానంలోకి రమ్మని హెచ్చరిస్తున్నట్టుగా ఉంది ఆ పిలుపు. కాళ్ళ తడబడుతున్నాయి.

"పద్మా, సుభద్రేది?"

"ఇంత త్వరగా వచ్చేశారేం?"

"ఈ రోజు నీ పుట్టినరోజని మరిచి పోయావా, పద్మా? ఇదిగో నీ ప్రెజంటేషన్. ఇది సుభద్రకి."

పద్మ అచేతనంగా అందుకుంది రెండు పాకెట్లనూ. తిరిగి అతను లోపలికి చూస్తూ పిలుస్తున్నాడు, "సుభద్రా!" అని.

"సుభద్ర లేదు" అంది అతి నెమ్మదిగా పద్మ, పాకెట్‌మీది దారం చేత్తో గీస్తూ.

"ఎక్కడికి వెళ్ళింది?"

పద్మ అతనివైపు చూడకుండా పొడిమాట లతో చెప్పింది. ప్రకాశరావు ఆ మాటలు వింటు న్నాడో, లేకపోతే అతనిలో చైతన్యం నశించిందో తెలుసుకోవడం కష్టం. ఆఖరికి భారంగా కుర్చీలో కూలబడ్డాడు. అప్పటికి మనిషిలో కదలిక వచ్చింది.

"పద్మా, నువ్వు మనిషివేనా?"

"అందుకే ఆ పని చేశాను" అంది నెమ్మ దిగా స్వరవిహీనంగా.

"సిగ్గులేకుండా ఇంకా మాట్లాడతావు దేనికి? ఎవరో ఏదో అంటున్నారని సుభద్రని తీసుకువెళ్ళి అనాథ బాలికాశ్రమంలో చేర్పి స్తావా? నీకు బుద్ధుందా?"

"సుభద్ర కూడా..."

"వాళ్ళే. అయితే నన్నూ అంటున్నారుగా! అందరూ చెడ తిరుగుతున్నానని. నాకూ విడాకు లివ్వలేకపోయావ్?"

"ఎందుకండీ ఆవేశపడతారు ఆలోచించ కుండా?"

"అవును. నువ్వు అర్థవిహీనంగా ప్రవర్తిస్తే నేను ఆలోచించాలా? నీకు జాలి అనేది ఉందా? తల్లిదండ్రులు లేని, డబ్బులేని మూలంగా సుభద్ర అంత అలుసయిందా? ఆఖరికి ధన వంతుల బిడ్డననిపించుకున్నావ్."

పద్మకు కళ్ళల్లో కారం జల్లినట్టయింది.

"నేను అలా అనుకోలేదు. అనుకుని ఉంటే చాలా పనులు జరిగేవి కావు. సుభద్రని ఇంత కాలం నేను ఆదరించలేదా?"

"నా కన్నీరు తుడవడంకోసం..."

"మీరు నమ్మినప్పుడు ఎలా చెప్పేది? అయినా దేశంలో అనాథలందరికీ మీరు హామీ తీసుకున్నారా? ఇంటికి వచ్చిన వాళ్ళందరికీ దానం చెయ్యడానికి మనమేం లక్షాధికారు లమా? ఏళ్లతరబడి పెంచి పెద్దచెయ్యడానికి ఇదేం సత్రమా?"

"పద్మా..."

"అవును. మీరు చేసే ప్రతి పనికి వంత పాడితే నచ్చినదానిగా కన్పిస్తాను. ఇంటిలో బ్రతకవలసినదాన్ని నేను. పదిమందికి సమా ధానం చెప్పలేక రోజూ ఏడుస్తూ కూర్చుంటే, మీకేం? నా బాధ ఎవరికి తెలుస్తుంది?"

"పద్మా, సుభద్ర ఎవరో నీకు తెలుసా?"

"తెలుసు."

"నీకు తెలియదు, పద్మా. తెలిసిఉంటే నువ్విలా నలుగురికి భయపడి ఆమెను బయటకు గెంటెయ్యలేవు. సుభద్ర నాన్నగారు నన్ను పెంచారు. పెద్ద చేశారు. నాకీ బ్రతుకిచ్చింది ఆయనే. అటువంటిది ఆయన కూతుర్ని నా చెల్లాయిలా పోషించడం తప్పంటావా? ఎవ్వో ఏదో అన్నారని నీ తోబుట్టువుని బయటికి గెంటగలవా?"

పద్మ అలాగే చూస్తున్నది.

"పద్మా, నీకేనాడో నా గురించి చెప్పాల్సింది. చెప్పలేకపోయాను. అందుకు కారణం నీమీద వ్యామోహం. డబ్బులేనివాణ్ణి అయినా ప్రేమను కాలదన్నే స్థైర్యం ఆనాడు నాలో లేదు. నిన్ను పెళ్లి చేసుకునేటప్పుడు కూడా నన్ను నేను మననం చేసుకుంటూనే వచ్చాను. నాకు గతం లోకి వెడితే, ఏంలేదు, వట్టి కల తప్పించి. అలాంటిది పద్మకు నా జీవితంలో ఏదో ఒకనాడు పరిచయం చెయ్యాలనుకునేవాణ్ణి. ఎంత మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నా, మనసులో కొన్ని అనుమానాలూ, కొన్ని శంకలూ ఉంటుంటాయి. మనసంతా విప్పి చెప్పుకోవాలన్నా ఏ మూలో కాస్త ముడత ఉండిపోతుంది. పద్మా, అది ఎవరికి వాళ్ళు విప్పిచూపుకోలేరు. ఆ పని ఎదుటి వ్యక్తి చేస్తే బాగుండునని మధనపడతాం. ఏదో ఒక నాడు నా ఆంతర్యం నువ్వే తెలుసుకుంటావను కున్నాను. కానీ అలా జరగలేదు. ఆవేశం వస్తేనే మనిషి ఆంతర్యం సిగ్గుపడ్డం మరిచిపోతుందేమో! నా మనస్సుకు పట్టిన గ్రహణం నేనే విప్పుకోవా లన్నమాట. ఇది బాధాకరం అయినా, నిన్నిం దులో చిత్తుచేసి ఇరికించడం నా కిష్టంలేదు. నేనూ, నా చరిత్రా నీకు ఇంతకాలం చెప్పక పోవడం నాదే తప్పేమో?"

అతను లోపలకు వెళ్ళి కొన్ని కార్డులూ, ఫోటో తీసుకువచ్చి పద్మ కిచ్చాడు. పద్మ గాభ రాగా అతన్ని చూస్తున్నది.

"ఇది చదువు, పద్మా. అంతా నీకు తెలు

స్వాతంత్ర్యం
వచ్చింది—
మన కేమని
అనుకోకండి
సర్వశక్తులా
దానిని
రక్షించుకోండి

స్తుంది. ఇది పూర్తిగా చదివిన తరువాత కూడా సుభద్ర నీకు బరువనిపిస్తే నేనేం చెయ్యలేను. సుభద్రని ఆదుకోవడం నా విధ్యుక్త ధర్మం. సుభద్ర మనింటిలో ఉండడం నీ కిష్టంలేకపోతే నేనేం చెప్పలేను. నీ మనసు చెప్పినట్టు చెయ్యి." ప్రకాశరావు బయటకు వెళ్ళిపోయాడు.

పద్మ రేపరు విప్పి చూసింది. ఓ కుర్రవాడి ఫోటో. దానిక్రింద ఇలా వ్రాసి ఉంది: "ఇతను వరద ప్రమాదంలో తల్లిదండ్రుల్ని పోగొట్టు కున్న విద్యార్థి. ఉదాత్త హృదయుల ప్రాపుమీద బ్రతకవలసి పసివాడు. ఆదరించే హృదయాలు కరిగి, కన్నీరు కారుస్తే బ్రతుకుతాడు. పేరు ప్రకాశరావు. స్వతహాగా ప్రకాశించలేని శాప గ్రస్తుడు." ఇంకా ఏమేమో వ్రాసి ఉంది.

పద్మ నిశ్చేష్టిత అయింది. కళ్ళల్లో చిన్ని ప్రకాశరావు రూపం ప్రతిబింబిస్తున్నది. తన భర్త జీవితం వెనుక ఇంతటి కన్నీరు కరడు కట్టి ఉన్నట్టు ఆమె ఏనాడూ ఊహించలేదు. అందు లోనే భద్రపరిచిన ఉత్తరం ఉంది. అది రమేశం గారు వ్రాసిన ఉత్తరం.

"ప్రకాశరావ్,

నువ్వు ఇంటర్ ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయ్యా నని వ్రాసిన ఉత్తరం, దానితో పంపిన కానుకలూ అందాయి. నిన్ను ప్రకాశరావు, ఎం. ఎ. గా చూడాలని ఆశగా ఉంది. నా ఆశ నిజమవుతుందని గుండె నవ్వుతూ చెబుతూంది. నేను లేకపోతే నువ్వు లేవని పదేపదే ఎందుకు వ్రాస్తావయ్యా? అందరినీ ఆదుకునేది ఆ భగవంతుడే. అందుకే నేమో మనలాంటి వాళ్లం ఎలాగో అలాగయినా బ్రతక గలుగుతున్నాం. తల్లిదండ్రులు యెవరో తెలియని నీకు నేను తండ్రిగా నిలబడినందుకు, విద్యావంతుడవుతూ, బుద్ధిమంతుడవై నాకు పేరు తెస్తున్నావు. చాలా సంతోషంగా ఉంది. నీకు నా సలహాలేం యివ్వగలను కానీ ఒకేమాట చెప్తాను చాలామందికి. అదే నీకూ చెప్తున్నా. మనల్ని మనం ఎప్పుడూ మరిచిపోకూడదు. మరిచిపోలేదని గర్వం కూడా ఉండకూడదు.

# మన ఢిల్లీ లేఖ

(42 వ పేజీ తరువాయి)

చెప్పారు. శ్రీ నెహ్రూ నాయకత్వాన్ని ప్రశంసిస్తూ, ఆయన పాలం విమానాశ్రయంవద్ద మాట్లాడటం, అమెరికాలో ఉన్న తప్పు అభిప్రాయాన్ని సరిచేయాలన్న ప్రయత్నంలో భాగమేనని స్పష్టంగా కనిపిస్తున్నది. ఎందుచేతనంటే అమెరికా పత్రికలలోని ఈ తప్పుడు వ్రాతలు కొంతవరకు ఇండియానుంచి వెళ్ళినటువంటివే.

ఇండియాపట్ల అమెరికా, బ్రిటన్‌లలో స్నేహపూర్వక సద్భావ వాతావరణాన్ని సృష్టించాలన్నదే ఆ దేశాలలో తన పర్యటన ముఖ్యోద్దేశమని రాష్ట్రపతి చెప్పారు. ఆర్థిక సహాయం కోసం, ఆయుధ సహాయంకోసం ఇతర దేశాలకు భారత ప్రతినిధివర్గాలు వెళ్లిన వెన్వెంటనే రాష్ట్రపతి వెళ్లటం కేవలం యాదృచ్ఛికంగా సంభవించిందిమాత్రమే. అయితే ఇందులో కూడ కొంతమంది ఆ ప్రతినిధివర్గాలు వెళ్ళటానికి, ఆ తర్వాత రాష్ట్రపతి వెళ్ళటానికి ఏదో సంబంధం అంటగట్టటానికి చూశారు. బహుశా ఇందులో ఏదైనా సంబంధం ఉండవచ్చునుగాని, వారు సూచించిన అర్థంలో మాత్రం లేదు. డాక్టర్ రాధాకృష్ణన్ కంటే ముందు వెళ్లిన మంత్రులు, అధికారులు భారతదేశంలో అత్యయిక పరిస్థితినుంచి ఉత్పన్నమయ్యే సమస్యలమీద జరిపిన చర్చలు, చేసిన బహిరంగ ప్రకటనలు, చైనా దురాక్రమణతో దేశం అతలాకుతలమైపోయిందనీ, దానిలోనే దేశం పూర్తిగా నిమగ్నమై ఉన్నదనీ, అందుచేత మానవత్వపు ప్రధాన విలువలను గురించి అసలు ఆలోచించటానికే దానికి వ్యవధి లేకుండా ఉన్నదనే అభిప్రాయాన్ని కలిగించి ఉన్నట్లయితే, ఆ అపోహను సరిదిద్దటానికి భారతదేశం నిజ వైఖరిని పునరుద్ఘాటించటానికి రాష్ట్రపతి పర్యటనకు మించినదేదీ ఉండబోదు. రాష్ట్రపతి పర్యటనలోని ఉద్దేశ్యం ఇది అయినా కాకపోయినా, ఆ ఫలితంమాత్రం లభించినట్లు స్పష్టంగా కనిపిస్తున్నది.

సామాన్య మానవులతో నిరంతర పరిచయం ఉండి, మానవత్వపు విలువలను క్షుణ్ణంగా అర్థం చేసుకున్న తత్వశాస్త్ర పండితుడు అయిన డా. రాధాకృష్ణన్ తన దేశప్రజల ఆశయాలను, ప్రగాఢ విశ్వాసాలను సరిగా వ్యాఖ్యానించగలరు. బ్రిటన్, అమెరికా ఈ రెండు దేశాలుకూడ అంతరంగిక కల్లోలాలతో సతమతమై ఉన్న తరుణంలో రాష్ట్రపతి పర్యటన సంభవించటం దురదృష్టకరమైన సంగతి. అయినప్పటికీ ఆ రెండు దేశాలలోను ఆయనకు గొప్ప స్వాగతమివ్వబడింది. బ్రిటన్‌లో ఈ పర్యటనను 'కామన్వెల్తు పర్యటన' గా వర్ణించి, ఆ సందర్భానికి మరింత సాన్నిహిత్యం ఆపాదించడానికి యత్నించారు.

మొత్తంమీద రాష్ట్రపతి అమెరికా, బ్రిటన్ పర్యటన ఇండో అమెరికన్ సంబంధాలను, ఇండో బ్రిటన్ సంబంధాలను మరింత పటిష్ఠం చేసింది.

## పర్యటనల రద్దీ

ప్రభుత్వ యంత్రాంగం అంతాకూడ కదులుతున్నట్లు కనిపిస్తున్నది. శ్రీ టి. టి. కృష్ణమాచారి ఆస్ట్రేలియానుంచి, పశ్చిమ దేశాలనుంచి తిరిగివచ్చారో లేదో ఆయన కార్యదర్శి శ్రీ భూతలింగమ్ రక్షణ ప్రతినిధివర్గాన్ని వెంట తీసుకొని మాస్కో వెళ్లారు. విమాన ప్రతినిధివర్గం ఒకటి యునైటెడ్ అరబ్ రిపబ్లిక్ నుంచి ఇటీవలే తిరిగి వచ్చింది. విమాన బలాధిపతి సోవియట్ యూనియన్ వెళ్లారు. పదాతి బలాధిపతి అమెరికా వెళ్ళుతున్నారు. ఇది అంతా చాలనట్లుగా విదేశాంగశాఖ ప్రధానకార్యదర్శి శ్రీ ఆర్. కె. నెహ్రూ పారిస్, బాన్, బెల్‌గ్రేడ్, ప్రాగ్, మాస్కో వెళ్ళుతున్నారు.

ఈ ప్రతినిధివర్గాలన్నిటికీ ఇతరమైన పనులేమైనా ఉన్నా లేకపోయినా, ఒక పనితో మాత్రం వీటన్నిటికీ సంబంధం ఉంది. భారత రక్షణావసరాలను వివరించి, ఆయుధ సహాయం ద్వారా, కొనుగోలు ద్వారా లేదా దేశంలో రక్షణోత్పత్తి శక్తిని పెంపొందించగల విదేశ సహాయం ద్వారా, ఈ అవసరాలను ఎట్లా తీర్చవచ్చునో ఈ ప్రతినిధివర్గాలన్నీ చర్చిస్తాయి.

మొదట చూసినప్పుడు, ఇంతమంది సీనియర్ అధికారులు ప్రపంచంలోని వివిధ దేశాలకు వెళ్ళుతూండటం, దేశ రక్షణను వేగంగా పటిష్ఠం చేయవలసిన ఆవశ్యకతను, అందుకు అనువైన చర్యలను సూచించవచ్చును. కాని రెండవసారి ఆలోచించినప్పుడు సందేహాలు తలెత్తుతాయి. ప్రతిచోటనుంచి ఏదో కొంత తెచ్చుకోవటం ప్రమాదకరమైన విషయం కావచ్చును. తీవ్రమైన పరిస్థితులలో అవసరం వచ్చినప్పుడు ఏదీ కూడ అందుబాటులో ఉండక పోవచ్చును. ఉన్నా నిరుపయోగంగా తయారు కావచ్చును.

ఇంతకంటే, దీర్ఘకాలిక అవసరాల దృష్ట్యా దేశంలో రక్షణ ఉత్పత్తి శక్తిని విస్తృతం చెయ్యటం ప్రధానమైన విషయం. దేశంలో ఆయుధోత్పత్తి ఫ్యాక్టరీల ఆధునికీకరణకు, విస్తృతీకరణకు సలహాలివ్వటానికి అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా దేశాల ఆయుధ ఉత్పత్తి నిపుణుల బృందాలు త్వరలో ఇండియా రాబోతున్నాయి. ఎం. ఐ. జి. కార్యక్రమం వరకు సోవియట్ నిపుణులు రాబోతున్నారు. అయితే భవిష్యత్ ఆయుధ ఉత్పత్తి కార్యక్రమం ఏ విధంగా ఉండబోతున్నది ఇంతవరకు స్పష్టంగా లేదు.

—డి. సుబ్రహ్మణ్యం

# మనోగ్రహణం

మనలాంటివాళ్ళు దేశంలో చాలామంది ఉన్నారు. వాళ్ళలో కొద్దిమంది కోసమైనా నిర్మలంగా కన్నీరు కార్చు. ప్రతివాళ్ళ బ్రతుకులో మధురస్వప్నాలు ఆకట్టుకోలేరు. కొందరిలో కన్నీటి కడలి జ్వలిస్తుంది. వాళ్ల బ్రతుకులో ఒక్క పన్నీటిబొట్టు విదుల్చు. ఇదే బాబా నీకు నేను చెప్పగలిగేది. సుభద్ర సెకండ్‌ఫారమ్ చదువుతూంది. అన్నయ్యేడని రోజా అడుగుతూందయ్యా.

రమేశం."

పద్మ ముందు ఆవేదన నిలిచింది. అంతవరకూ జవాబులేని ప్రశ్నకు అర్థం స్ఫురించింది. కళ్లవెంబడి కన్నీరు, ఆ కన్నీటిలోంచి కల్మషం రాలిపోతున్నవి. తొందరపాటు శరీరంలోంచి సిగ్గుచేత దొంగలా పారిపోతున్నది. లేచి నెమ్మదిగా వెళ్లి వాకిట్లో నిల్చుంది పద్మ. ★